సాక్షి పల్నాడు

బుధవారం । 19 । మార్చి । 2025



నేడు పునీత జోజప్ప మహోత్సవం

పెదకూరపాడు: జలాలపురం పునీత జోజప్ప చర్చిలో జోజప్ప మహోత్సవం బుధవారం జరగనుంది. సమష్టి దివ్య పూజాబలి నిర్వహణకు చర్చి కమిటీ ఏర్పాట్లు పూర్తిచేసింది.




సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 518.80 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడ భవానీపురానికి చెందిన కనమర్లపూడి రామకృష్ణ, సౌమిత్రి పద్మవల్లి రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు.



న్యూస్‌రీల్

పౌర సరఫరా సేవలు సక్రమంగా ఉండాలి

జేసీ సూరజ్ గనోరే



నరసరావుపేట: జిల్లావ్యాప్తంగా సివిల్ సప్లయ్ సర్వీసులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే పేర్కొన్నారు. మంగళవారం జిల్లాలో నిర్వహిస్తున్న రీసర్వే, సివిల్ సప్లయి సర్వీసులపై కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ సివిల్ సప్లయ్ సర్వీస్ సక్రమంగా లేని చోట వాటిని క్రమబద్ధీకరించి సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్వే జరుగుతున్న గ్రామాల్లో రైతులు సంతృప్తి పడేలా రీసర్వే జరగాలని ఆదేశించారు. సర్వేయర్ విభాగ ఏడీ, డీఎస్ఓతోపాటు నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల ఆర్డీఓలు, 28 మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, డీఐఓఎస్, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ



గుంటూరు లీగల్: క్యాలెండరు యక్టివిటీస్‌లో భాగంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు మంగళవారం గుంటూరు మహిళా ప్రాంగణంలోని ఎస్టీ బాలికల పాఠశాల, వసతి గృహాన్ని, ఎస్టీబాలికల కళాశాల వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందుతున్న సదుపాయాల గురించి, ఆహార నాణ్యత గురించి తెలుసుకున్నారు. అనంతరం స్కూల్ వసతి గృహం వార్డెన్ జి.హిమ శిల్ప, కళాశాల వార్డెన్ రాజేశ్వరిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బీఈడీ పేపర్ లీకేజీ కేసులో నిందితులకు బెయిల్

గుంటూరు లీగల్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బీఈడీ పేపర్ లీకేజీ విషయంపై పెద్దకాకాని పోలీస్ స్టేషన్లో నమోదు చేసిన కేసులో ఏడుగురు నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. ఈ ఏడుగురికీ బెయిల్ మంజూరు చేస్తూ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో విచారణ జరగాల్సి ఉంది.

1,33,222 బస్తాలు మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,28,999 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,33,222 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,500 నుంచి రూ.13,800 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 63,975 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

ఒంటరి మహిళలే లక్ష్యం

వినుకొండలో పేట్రేగుతున్న దుండగులు

- బంగారం కోసం మహిళలను హతమారుస్తున్న వైనం
- వినుకొండ కొత్తపేటలో ఏడాది కాలంలో ఇరువురు మహిళల హత్య
- ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు ఇంటి సమీపంలో ఘటనలు
- మహిళల భద్రత ప్రశ్నార్థకం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు



నిందితుల ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసు జాగిలాలు

వినుకొండ: ఒంటరి మహిళలను టార్గెట్‌గా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతూ ఎదురు తిరిగిన వాళ్లను చంపుతూ దొంగలు యథేచ్ఛగా హత్యాకాండ సాగిస్తున్నారు. వినుకొండకు గుండెకాయ లాంటి కొత్తపేట ప్రాంతంలో ఏడాది తిరగకుండానే ఇద్దరు వృద్ధ మహిళలను టార్గెట్‌గా చేసుకొని వారిని హతమార్చి, వారి ఒంటిపై ఉన్న బంగారం దోచుకెళ్లడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఇద్దరినీ అత్యంత కిరాతకంగా చంపి బంగారాన్ని ఎత్తుకెళ్లడం గమనార్హం.

కలకలం రేపిన సావిత్రి హత్య..

సోమవారం రాత్రి కొత్తపేటలో మెయిన్‌బజారులో వినాయకుడి గుడి వద్ద ఒంటరిగా ఉంటున్న కొప్పరపు సావిత్రి అనే 75 ఏళ్ల మహిళ ఇంట్లోకి పట్టపగలే ప్రవేశించిన దుండగులు ఆమెను హత్య చేసి ఆమె ఒంటిపై బంగారాన్ని దోచుకెళ్లారు. అలాగే ఇంట్లో టీవీ సౌండ్ పెంచి టీవీ చూస్తున్నట్టుగా భ్రమింపజేసి బయట తాళం వేసి పరారయ్యారు. స్కూల్‌కు వెళ్లి వచ్చిన ఆమె మనవరాలు ఎంతసేపటికీ పిలిచినా పలకక పోవడంతో స్థానికుల సాయంతో తలుపులు పగలగొట్టగా అప్పటికే సావిత్రి మృతి చెందినట్లు గుర్తించారు. రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



గత ఏడాది జూన్ 19న హత్యకు గురైన కోటిరత్నం (ఫైల్)

గతేడాది ఇదే ప్రాంతంలో...

ఇదిలా ఉంటే.. గత ఏడాది జూన్ 19వ తేదీన ఇదే కొత్తపేట ప్రాంతంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న పి.కోటిరత్నం అనే 75 ఏళ్ల వృద్ధురాలి మెడలో గొలుసు చోరీకి విఫలయత్నం చేసిన దొంగలు ఆమె ఎంతసేపటికీ గొలుసు వదలకపోవడంతో తలపై రాయితో కొట్టి హత్య చేసి పారిపోయారు. రెండు హత్యలు పట్టపగలే జరగడంతో ఆ ప్రాంతంలో మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. అయితే కోటిరత్నం హత్య జరిగి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ కేసు దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేకపోవడం గమనార్హం.



సోమవారం హత్యకు గురైన సావిత్రి

జీవీ ఇంటికి కూత వేటు దూరంలోనే..

స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఇంటి సమీపంలోనే ఇలాంటి ఘటనలు జరుగుతుండడం భద్రత వైఫల్యాలకు అద్దం పడుతుంది. దొంగలు రాత్రిళ్లే కాకుండా పట్టపగలే ఇలాంటి దుర్ఘటనలకు పాల్పడుతుండడం పోలీసు వైఫల్యాలను ఎత్తి చూపుతోంది. డాగ్ స్క్వాడ్, సీసీ కెమెరాలు అత్యాధునిక సమాచార వ్యవస్థ ఉన్నప్పటికీ కేసుల దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేకపోవడం విచారకరం. ఇప్పటికైనా పోలీసులు వేగవంతమైన దర్యాప్తు చేపట్టి మహిళల భద్రతపై నమ్మకం కలిగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



భారీగా చేరుకున్న అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

వైవీ మాతృమూర్తికి

కన్నీటి వీడ్కోలు

- వైవీ సుబ్బారెడ్డి తల్లి అంత్యక్రియలకు మేదరమెట్లకు వచ్చిన జగన్
- సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ భౌతిక కాయానికి నివాళులు
- కుటుంబ సభ్యులకు పరామర్శ
- అర్ధగంటపాటు అక్కడే గడిపిన జననేత

సాక్షి ప్రతినిధి,బాపట్ల: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ సోమవారం ఒంగోలులో మృతిచెందగా స్వగ్రామం మేదరమెట్లలో ఆమె అంత్యక్రియలు మంగళవారం బంధువులు, పార్టీశ్రేణుల అశ్రునయనాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని తెలుసుకొని వేలాదిగా కార్యకర్తలు, అభిమానులే కాదు సామాన్య జనమూ తరలి వచ్చారు. ఎంతగా అంటే జనం తాకిడికి జగన్ కాన్వాయ్ ముందుకు కదలలేకపోయింది. ఆ తర్వాత జగన్ వైవీ ఇంటికి చేరుకొని అక్కడ సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించి చిన్నాన్న వైవీ.సుబ్బారెడ్డి, చిన్నమ్మ స్వర్ణమ్మ, చిన్నాన్నలు వైవీ భద్రారెడ్డి, హనుమారెడ్డి, సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్‌రెడ్డిలతోపాటు వారి కుటుంబ సభ్యులందరినీ పరామర్శించారు. భుజంతట్టి ఓదార్చారు. అక్కడే ఉన్న తల్లి విజయమ్మ, మేనమామ రవీంద్రనాథరెడ్డి ఇతర బంధువులతో మాట్లాడారు. అర్ధగంట పాటు అక్కడే ఉన్న వైఎస్ జగన్ కుటుంబ సభ్యులతో గడిపారు. వైఎస్సార్ సీపీ నేతలను పేరుపేరునా పలకరించారు. వైవీ ఇంటి నుంచి జగన్ తిరుగు ప్రయాణంలోనూ ఆయన వాహనం ముందు చేరిన కార్యకర్తలు, అభిమానులు నినాదాలతో హోరెత్తించారు. పిచ్చమ్మ భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, మాజీ ఉపముఖ్యమంత్రి మంత్రి నారాయణస్వామి, మాజీ మంత్రులు కారుమూరు నాగేశ్వరరావు, ఆదిమూలపు సురేష్, అంబటి రాంబాబు, విడదల రజని, జోగి రమేష్, ప్రకాశం జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ముస్తాఫా, బుర్రా మధుసూదనయాదవ్, జంకె వెంకటరెడ్డి, టీజేఆర్ సుధాకర్‌బాబు, పార్టీ నాయకులు కరణం వెంకటేశ్, గాదె మధుసూదన్‌రెడ్డి, వరికూటి అశోక్‌బాబు, మేరిగ మురళి, చుండూరు రవి, పానెం చిన హనిమిరెడ్డి తదితరులు నివాళులర్పించారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల పరిస్థితి నానాటికీ దయనీయంగా మారుతోంది. ఆరుగాలం శ్రమించి పండిస్తున్న పంటకు మద్దతు ధర లభించక రైతులు అప్పల ఊబిలో కూరుకుపోతున్నారు. అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట చేతికందే సమయానికి ప్రభుత్వం నిర్లక్ష్యం వారి పాలిట శాపంగా మారుతోంది. ఇప్పుడు తెల్లజొన్న రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

తెల్లజొన్న రైతు విలవిల



క్రాప సమీపంలో జొన్న పంట కోస్తున్న కూలీలు

- పంట చేతికందినా విక్రయించే మార్గం శూన్యం
- ప్రభుత్వం నుంచి కొనుగోలు, మద్దతు ధర లేక ఆవేదన
- దళారులకు తక్కువ ధరకే అమ్మాల్సిన దుస్థితి
- కూటమి సర్కారు తీరుతో నష్టపోతున్న అన్నదాతలు



కోతకు సిద్ధంగా ఉన్న తెల్లజొన్న

కొల్లూరు: ఖరీఫ్‌లో వరి సాగు చేసిన అన్నదాతలు మూడొంతులు పంట అయినకాడికి దళారులకు విక్రయించి నష్టాలను చవిచూశారు. నామమాత్రంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో సామాన్య రైతులు పండించిన పంటల విక్రయానికి అంక్షలు ఎదురవడంతో దళారులను ఆశ్రయించక తప్పలేదు. ప్రస్తుతం రబీలో సాగు చేసిన పంటకైనా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి పారదర్శకంగా కొనుగోలు చేస్తుందని ఆశించిన రైతులకు భంగపాటే ఎదురవుతోంది.

దీనంగా తెల్లజొన్న రైతుల పరిస్థితి

రబీలో తెల్లజొన్న సాగు చేసిన రైతుల పరిస్థితి దీనంగా మారింది. నియోజకవర్గంలో చుండూరు, అమృతలూరు మండలాలలో రైతులు అధిక శాతం మినుము, పెసర సాగు చేశారు. పెసర పంటకు మాత్రమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు మండలాలలో ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న పంట సాగైంది. సుమారు 8 వేల ఎకరాలకు పైగా తెల్లజొన్న సాగులో ఉంది.

కొనే దిక్కేది?

కొల్లూరు మండలంలో 1,700 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో తెల్లజొన్న వేయగా.. ప్రస్తుతం పంట చేతికందింది. రైతులు జొన్న కంకులు కోసుకొని నూర్పిళ్లు పూర్తి చేస్తున్నారు. మండలంలోని కొల్లూరు, క్రాప, అనంతవరం, చిలుమూరు ప్రాంతాలలో తెల్లజొన్న కంకులు కోత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం సుమారు 200 ఎకరాల వరకు జొన్న కోతలు పూర్తయ్యాయి. ఎకరాకు సుమారు రూ. 20 వేలు పెట్టుబడులు పెట్టారు. సగటున 25 బస్తాల దిగుబడి లభిస్తోంది. గతేడాది ఇదే సమయంలో జొన్న క్వింటాకు రూ. 2,400 వరకు లభించడంతో రైతులకు లబ్ధి చేకూరింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకటించకపోవడంతో క్వింటాకు దళారులు రూ. 2 వేలు నుంచి రూ. 2,100 వరకు ఇస్తున్నారు. దీంతో రైతాంగం నష్టపోతోంది. రబీలో సాగు చేసిన పంటల విక్రయాలకు వీలుగా వ్యవసాయ శాఖాధికారులు ఈక్రాప్ బుకింగ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది.

కొనుగోలు కేంద్రాల ఊసేదీ?

రబీలో సాగు చేసిన పంటల కొనుగోలుకు వ్యవసాయ శాఖాధికారులు పంట నమోదు చేసినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులకు నష్టం వాటిల్లుతోంది. దళారులు చెప్పిన ధరలకే అమ్ముకోవాల్సిన అగత్యం ఏర్పడింది. పంట కోతలు చివరి దశకు చేరుకునే సమయంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ప్రయోజనం లేకుండాపోతుంది.

– టి. సురేష్, రైతు

అనుమతులొస్తే కేంద్రాలు ఏర్పాటు



తెల్లజొన్న ప్రస్తుతం కోత దశకు రావడంతో రైతులు నూర్పిళ్లు చేపడుతున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో మార్క్‌ఫెడ్ నుంచి ఆదేశాలు రాలేదు. అనుమతులు వచ్చిన వెంటనే కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

– ఆర్.వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖాధికారి, కొల్లూరు.

లోగుట్టు పెరుమాళ్లకే ఎరుక!

గోల్డ్‌మెన్ పెరుమాళ్ల రాజేష్ కేసులో కొత్త మలుపు

- తెరపైకి టీడీపీ నాయకుడు చేబు సురేష్ పేరు
- సురేష్ వద్దే రాజేష్ బంగారం, వెండి వస్తువులు దాచినట్లు ఆరోపణలు
- స్వాధీనం చేసుకున్న పోలీసులు!
- నిందితుడిని ఎలాగైనా పట్టిస్తానని బాధితుల నుంచి రూ.లక్షలు వసూలు చేసిన సురేష్!



పెరుమాళ్ల రాజేష్ (ఫైల్)

పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో గోల్డ్‌మెన్ (గోల్డ్ బిస్కెట్ల విక్రయదారుడు) పెరుమాళ్ల రాజేష్ కేసు రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. పిడుగురాళ్ల పట్టణంతోపాటు చుట్టుపక్కల పట్టణాల్లోని పలువురు వ్యాపారుల వద్ద రూ.8 లక్షలు విలువ చేసే 100 గ్రాముల గోల్డ్ బిస్కెట్‌ను రూ.7లక్షలకు ఇస్తానని చెప్పి రూ.కోట్లు వసూళ్లు చేసి పట్టణం విడిచి పారిపోయిన ఘటన ఈనెల 11వ తేదీన వెలుగులోకి వచ్చింది. సుమారు రూ.100 కోట్లకు పైగానే వసూలు చేసుకొని బాధితులకు బిస్కెట్లు ఇవ్వకుండానే శ్రీలంకలో తలదాచుకున్నట్లు పుకార్లు షికార్లు కొడుతున్నాయి.

తెరపైకి టీడీపీ నేత చేబు పేరు..

ఈక్రమంలో టీడీపీ ఆర్యవైశ్య నాయకుడు చేబు సురేష్ పాత్ర తెరపైకి వచ్చింది. బంగారు బిస్కెట్‌లు తక్కువ ధరకు తీసుకొని వస్తానని మాయచేసి వ్యాపారులకు రూ.కోట్లు కుచ్చుటోపీ పెట్టిన రాజేష్ మిత్రుడే ఈ చేబు సురేష్. పెరుమాళ్ల రాజేష్ మార్చి 3వ తేదీ బోర్డు తిప్పేసి శ్రీలంక వెళ్లినట్లు సమాచారం. అయితే ఫిబ్రవరి 28వ తేదీన పిడుగురాళ్ల పట్టణంలోని డీబీఎఫ్ బ్యాంక్‌లో తాను దాచుకున్న బంగారు, వెండి ఆభరణాలతో కూడిన రెండు గోతాలను రాజేష్ తన మిత్రుడైన చేబు సురేష్ వద్ద దాచి ఉంచాడన్న వార్త ఇప్పుడు పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారింది. అయితే రాజేష్ కనిపించకుండా పోయినప్పటి నుంచి చేబు సురేష్ రాజేష్‌కు డబ్బు ఇచ్చిన మోసపోయినవారందరితో మీ అందరికీ న్యాయం చేస్తానని, అందుకు కోటికి రూ.లక్ష ఇస్తే పోలీసుల సహాయంతో పెరుమాళ్ల రాజేష్‌ను పట్టుకొచ్చి డబ్బులు వసూళ్లు చేయిస్తానని బాధితులతో మాట్లాడి ఇప్పటికే సుమారు రూ.10 లక్షలు వసూళ్లు చేసినట్లు పలువురు బాధితులు పేర్కొంటున్నారు. తనకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అండదండలు ఉన్నాయని, తన్ను నమ్మితే రాజేష్‌ను పట్టకొచ్చి ఖచ్చితంగా మీ డబ్బులు మీకు వచ్చేలా న్యాయం చేస్తానని చేబు సురేష్ బాధితులతో చర్చించాడనేది కొసమెరుపు.

బంగారు ఆభరణాల గోతాలు స్వాధీనం!

ఇదిలా ఉండగా బాధితులు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయటంతో పిడుగురాళ్ల పట్టణ పోలీసులు కేసును మంగళవారం రంగంలోకి దిగారు. డీబీఎస్ బ్యాంక్‌కు వెళ్లిన పోలీసులు ఫిబ్రవరి 28వ తేదీన సీసీ ఫుటేజ్ పరిశీలించటంతో రాజేష్ మిత్రుడు సురేష్‌కు రెండు బంగారు ఆభరణాల గోతాలు ఇచ్చినట్లు గుర్తించారు. ఈ విషయమై సురేష్‌ను పట్టణ పోలీసులు విచారించే కార్యక్రమం మొదలు పెట్టారు. అంతేకాకుండా రెండు గోతాల నగల గోతాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా పెరుమాళ్ల రాజేష్ ముఖ్య అనుచరుడైన వందనపు రవిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. పెరుమాళ్ల రాజేష్ కోసం మూడు, నాలుగు బృందాలుగా పోలీసులు వెతుకులాట మొదలు పెట్టారు. హైదరాబాద్, కోల్‌కత్తా, ఇతర ప్రాంతాల్లో పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

వినుకొండలో కిడ్నాప్ కలకలం!

- రూ.కోట్లు విలువైన భూమిపై కన్నేసిన టీడీపీ నేతలు
- తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని యజమానిని కిడ్నాప్!
- విషయం బయటకు పొక్కడంతో రాజీకోసం యత్నాలు

సాక్షిటాస్క్‌ఫోర్స్: వినుకొండలో టీడీపీ నేతలు వివాదాస్పద భూములు, ప్రభుత్వ భూములు, అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు బరి తెగిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... వినుకొండ పట్టణానికి కొద్దిదూరంలో ఈపూరు మండలం బోడిశంభునిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో సర్వేనెం 23–1లో 1.78 ఎకరాల విలువైన భూమిపై కొందరు టీడీపీ నాయకుల కన్నుపడింది. గుంటూరు – కర్నూలు జాతీయ రహదారిని అనుకుని ఉన్న రూ.కోట్ల విలువైన ఈ భూమిని ఎలాగైనా దక్కించుకోవాలనే దురుద్దేశంతో వినుకొండ పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన భానుప్రసాద్ అనే వ్యక్తిని కొందరు టీడీపీ నాయకులు కిడ్నాప్‌చేసి బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి తెచ్చారు. ప్రస్తుతం ఈ విషయం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2002 సంవత్సరంలో ఆ భూమిని శంకరస్వామి అనే వ్యక్తి ప్రభుత్వం నుంచి డీకే పట్టా పొందారు. అయితే ఆయన తన మేనల్లుడైన భానుప్రసాద్‌కు 2024లో నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేశారు. అయితే స్థానికంగా ఉన్న కొందరు నేతలు రూ.కోట్లు విలువైన భూమి ఎవరో రిజిస్ట్రేషన్ చేయించుకోవడమేమిటీ అన్న భావనతో అతణ్ణి బెదిరిస్తే విలువైన భూమి సులభంగా పొందవచ్చనే కుట్ర పన్నారు.

ఈక్రమంలో గ్రామ పంచాయతీ అధికారుల ద్వారా గ్రామ కంఠం భూమి రిజిస్ట్రేషన్ విషయమై ఫిర్యాదు చేయించి, అనంతరం పోలీసుల ద్వారా పావులు కదిపి గ్రామకంఠం భూమిని ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నావంటూ భానుప్రసాద్‌ను స్టేషనుకు పిలిపించి ఆ భూమి తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని లేకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటావని బెదించారు. అక్కడ సైతం మాట వినకపోవడంతో కిడ్నాప్ చేసి తీవ్రంగా బెదిరించినట్లు సమాచారం. దీంతో చేసేదేమి లేక భానుప్రసాద్ ఒప్పుకున్నట్లు సమాచారం. అయితే విషయం బయటకు పొక్కడంతో జాగ్రత్త పడిన కుట్రదారులు తేలుకుట్టిన దొంగల్లా ఇప్పుడు రాజీకి దిగినట్లు సమాచారం.

కార్యదర్శి ఫిర్యాదు మేరకే...

నేను ఎలాంటి సివిల్ పంచాయితీలో తలదూర్చలేదు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకే ఈ భూముల విషయంలో విచారణ చేస్తున్నాం.

– ప్రభాకర్, వినుకొండ రూరల్ సీఐ

పొంతనలేని అధికారుల మాటలు..

తొలుత గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికుమార్ గ్రామకంఠం భూమిని అక్రమంగా రిజిష్టేషన్ చేశారని పోలీస్టేషనులో ఫిర్యాదు చేసినట్లు రూరల్ సీఐ ప్రభాకర్ తెలిపారు. గ్రామకంఠం భూమికి పట్టా ఎలా ఇచ్చారని రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తే ఆ భూమి ఎలాంటి నిషేధిత భూముల జాబితాలో లేకపోవడంతో పట్టా ఇచ్చామని చెబుతుండటం గమనార్హం. అంతా నిబంధనల ప్రకారమే జరిగినప్పటికీ పోలీసులు, పంచాయతీ అధికారులు ఈ వ్యవహారంలో తలదూర్చటమే వివాదాస్పదంగా మారింది. ఏది ఏమైనప్పటికీ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వివాదానికి చెక్‌పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

కాసు మహేష్‌రెడ్డికి వైఎస్ జగన్ పరామర్శ

నరసరావుపేట: ఇటీవల బాత్‌రూమ్‌లో కాలు జారిపడి గాయపడ్డ గురజాల మాజీ శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం తనకు ఫోన్‌చేసి జరిగిన సంఘటన గురించి జగన్ అడిగి తెలుసుకున్నారని కాసు మహేష్‌రెడ్డి వెల్లడించారు.

'ప్రకృతి' ప్రణాళికలో భాగస్వాములు కావాలి

నరసరావుపేటరూరల్: రైతులు ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళికలో భాగస్వాములు కావాలని ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. రావిపాడు రోడ్డు లోని బృందావనంలో నరసరావుపేట, పిడుగురాళ్ల, సత్తెనపల్లి సబ్ డివిజన్ సిబ్బందికి మంగళవారం రెండు రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ జూమ్ వీడియో కాల్‌లో సిబ్బందితో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో భూమి, పంట ఆరోగ్యంగా ఉంటుందన్నారు. గ్రామాల్లో ప్రతి రైతు 31 రకాల విత్తనాల ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్‌ను పాటించే విధంగా సిబ్బంది కృషిచేయాలని సూచించారు. స్టేట్ రీసోర్స్ పర్సన్ రామచంద్రన్ మాట్లాడుతూ ప్రధాన పంటలతో పాటు ఐదు రకాల అంతర పంటలను సాగు చేయాలని తెలిపారు. దీని వలన రైతుకు అదనపు ఆదాయంతో పాటు ప్రధాన పంటకు అవసరమైన సూక్ష్మపోషకాలు అందుతాయని తెలిపారు. డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ ఖరీఫ్ ప్రణాళికలో రైతు భూమి విస్తీర్ణం, పంట, పశువులు వివరాల నమోదు చేయాలని తెలిపారు. రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల వివరాలు అందుబాటులో ఉంచాలన్నారు. అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్, స్టేట్ ఎన్‌ఎఫ్‌ఏలు మన్విత, లక్ష్మి, జిల్లా శిక్షకుడు సైదయ్య, నందకుమార్, సౌజన్య, అప్పలరాజు, మేరి, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

పోలీసు కస్టడీలో తురకా కిషోర్

గురజాల: మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిషోర్‌ను మంగళవారం పోలీసు కస్టడీకి తీసుకున్నట్లు నాగార్జునసాగర్ పోలీసుస్టేషన్ ఎస్ఐ తెలిపారు. 2022లో తురకా కిషోర్‌పై 307 కేసు నాగార్జునసాగర్ పోలీసు స్టేషన్‌లో నమోదయిందన్నారు. ఈ కేసులో విచారణ నిమిత్తం కోర్టును ఆశ్రయించగా, కోర్టు ఆదేశం మేరకు నెల్లూరు సబ్‌జైలులో రిమాండ్ ఉన్న తురకా కిషోర్‌ను పోలీసు కస్టడీలోకి తీసుకున్నట్లు తెలిపారు. కిషోర్‌ను గురజాల పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చి రెండు రోజులపాటు విచారణ చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతు కుటుంబాలు, స్థానికులకు ఉద్యోగాలు

సిమెంట్ ఫ్యాక్టరీల ప్రతినిధులకు సూచించిన జిల్లా కలెక్టర్



సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతినిధులు, అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్, చిత్రంలో జిల్లా ఎస్పీ

నరసరావుపేట: జిల్లాలో సిమెంట్ ఫ్యాక్టరీల ఏర్పాటుకై పొలాలు ఇచ్చిన రైతు కుటుంబాల్లో అర్హులైన వారికి విధిగా ఉపాధి కల్పించి, ఉద్యోగాల్లో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.అరుణబాబు ఆయా కంపెనీల ప్రతినిధులను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో భవ్య, చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతినిధులు, గ్రామస్తులు, అధికారులతో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలసి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా అభివృద్ధికి పరిశ్రమల అవసరం చాలా ముఖ్యమన్నారు. సిమెంట్ పరిశ్రమలు ఉన్న తంగేడ, పెదగార్లపాడు ప్రదేశాలలోని పొలాలు రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తుల తరఫున జానీబాషా, సీవీ రావు లేవనెత్తిన ఐదు ప్రధాన అంశాలపై సంబంధిత రెవెన్యూ, పంచాయతీ రాజ్, సర్వే, వ్యవసాయ, ఉద్యాన, హౌసింగ్ తదితర శాఖలతో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి 10 రోజుల్లో నివేదిక అందించాలని ఆదేశించారు. దాని ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కంపెనీల యజమాన్యాలు ప్రభుత్వ అధికారులకు సహకరిస్తూ ఆయా గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. ఎస్పీ శ్రీనివాస రావు మాట్లాతూ పరిశ్రమల యాజమాన్యం స్థానిక ప్రజల మనసు దోచుకొనే విధంగా పలు చర్యలు చేపట్టాలన్నారు. లా అండ్ ఆర్డర్ సమస్యలు రాకుండా వ్యవహరించాలని కోరారు. జేసీ సూరజ్ గనోరే, డీఆర్‌ఓ ఎ.మురళి, గురజాల ఆర్డీఓ మురళి, జిల్లా పరిశ్రమల అధికారి రవీంద్ర, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి నజీన బేగం, డీపీఓ ఎంవీ భాస్కరరెడ్డి, డీఏఓ ఐ.మురళి, ఉద్యాన శాఖాధికారి సీహెచ్.వి.రమణారెడ్డి, హౌసింగ్ పీడీ ఎస్.వేణుగోపాలరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.





మేదరమెట్లలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ పార్థీవ దేహం వద్ద మంగళవారం నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట ఇన్‌చార్జి విడదల రజని, నరసరావుపేట ఇన్‌చార్జి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

మాలలను అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర

ఎస్సీ వర్గీకరణకు కేబినేట్ ఆమోదంపై మాల మహానాడు ఆగ్రహం

నరసరావుపేట: రాష్ట్రంలో మాలలు, వారి ఉప కులాలను అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదాన్ని వ్యతిరేకిస్తూ మాల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. మంగళవారం నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ విస్తల జయరావు ఆధ్వర్యంలో పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లతో నిరసన దీక్ష చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనికి హాజరైన జాన్‌పాల్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. 2021 జనాభా లెక్కలు తేల్చకుండా వర్గీకరణ అమలు చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్రంలో వేసిన వన్‌మెన్ కమిషన్ ఇచ్చిన నివేదికకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపటాన్ని మాల మహానాడు వ్యతిరేకిస్తుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఇస్తూ చేసిన సూచనలను అమలు చేయకుండా, ఎంపారికల్ డేటా తీయకుండా రాష్ట్ర విభజనకు ముందు ఉన్న 2011 జనాభా లెక్కలను ఆధారం చేసుకొని వర్గీకరణ చేయటం దారుణన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన పనులు చేస్తున్న ప్రభుత్వానికి ప్రజా పోరాటంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా రానున్న రోజుల్లో నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పల్నాడు జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గోదా బాల, జిల్లా ఉపాధ్యక్షుడు కోండ్రు విజయ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిపూడి ఏసురత్నం, జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రపాటి ఎర్రయ్య, నాయకులు పాల్గొన్నారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

రైతులకు నష్టపరిహారం చెల్లిస్తాం



నరసరావుపేట: జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రావిపాడు గ్రామ రైతులకు తగిన నష్టపరిహారం ఇస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో భూములు కోల్పోతున్న నరసరావుపేట మండలం రావిపాడు గ్రామస్తులకు నష్టపరిహార చెల్లింపులపై నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి జేసీ హాజరై రైతులకు ఈ మేర హామీ ఇచ్చారు. ఆర్డీఓ కె.మధులత, జాతీయ రహదారి విస్తరణ అధికారులు, తహసీల్దార్ వేణుగోపాలరావు, మండల సర్వేయర్ మాట్లాడారు. రైతులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై పిల్లలకు అవగాహన కల్పించాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి

నరసరావుపేట: తమపై జరిగే లైంగిక వేధింపులను నిరోధించే పోక్సో చట్టం గురించి పిల్లలకు అవగాహన కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. మంగళవారం పల్నాడు రోడ్డులోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో చైల్డ్ హుడ్ సెక్సువల్ అబ్యూస్ పోక్సో చట్టంపై విద్యా, ఐసీడీఎస్, విజువల్లీ ఛాలెంజ్ విభాగ అధికారులు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రవి మాట్లాడుతూ 2012లో వచ్చిన చట్టం 18ఏళ్ల లోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల గురించి రక్షణ కల్పిస్తుందని అన్నారు. పిల్లలను ముద్దు, లైంగిక చర్యకు ప్రేరణ, రహస్య భాగాలను తాకడం, నగ్నచిత్రాలను చూపడం వంటివి వేధింపుల్లో భాగమేననే విషయం చిన్నారులకు అవగాహన కలిగించాలని అన్నారు. చాలా సందర్భాల్లో లైంగికంగా వేధించే వారు కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువులై ఉండటం వల్ల ఫిర్యాదు చేయడానికి వెనకాడుతున్నారన్నారు. బాలికలపై లైంగికదాడులకు పాల్పడే నిందితులకు కఠినమైన శిక్షలు అమలయ్యేలా ఈ చట్టం రూపొందించబడిందన్నారు. మహిళలపై లైంగికదాడికి పాల్పడిన వారికి 7–10 ఏళ్ల జైలు వేస్తారని, అయితే 16 సంవత్సరాల లోపు బాలికలపై లైంగికదాడి జరిగితే కనీసం 10–20 సంవత్సరాల వరకు జైలు జీవితం అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాజేశ్వరి, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ హనుమకుమార్, నీలకంఠేశ్వరరావు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ సక్రమంగా లేకుంటే చర్యలు

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.నారదముని



కలెక్టర్ కార్యాలయంలో ఎండీయూ ఆపరేటర్లతో మాట్లాడుతున్న డీఎస్‌ఓ నారదముని

నరసరావుపేట: రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయని ఎండీయూ ఆపరేటర్లపై చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.నారదముని హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని ఎండీయూ ఆపరేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు. ఐవీఆర్‌ఎస్ ద్వారా ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాల్లో ఎండీయూ ఆపరేటర్లపై పలు ఆరోపణలు వచ్చాయన్నారు. దీని వలన జిల్లాకు చెడ్డపేరు వస్తుందన్నారు. బియ్యం సమయానికి పంపిణీ చేయాలని, నాణ్యతలేని బియ్యం వస్తే వాటిని ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తిరిగి అప్పగించి, మంచి బియ్యం తీసుకొని కార్డుదారులకు పంపిణీ చేయాలన్నారు. అలాగే పంపిణీ చేసే సరుకులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అందజేయాలన్నారు. ఫిర్యాదులు నమోదైన ఎండీయూ ఆపరేటర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రజకుల సత్రం స్థలాన్ని కాపాడండి

ఆర్డీఓను కోరిన అమరావతి రజక ఐక్యవేదిక నాయకులు



ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో ధర్నా చేస్తున్న రజక ఐక్యవేదిక నాయకులు

నరసరావుపేట: కోటప్పకొండరోడ్డులోని రజకుల సత్రం స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని స్థలాన్ని తిరిగి ఇవ్వాలని అమరావతి రజక ఐక్యవేదిక నాయకులు కోరారు. మంగళవారం కార్యాలయ ప్రాంగణంలో ధర్నా నిర్వహించి ఆర్డీఓ కె.మధులతను కలిసి ఈ మేరకు విన్నవించారు. ఈసందర్భంగా ఐక్యవేదిక అధ్యక్షుడు ఉదయగిరి వెంకటస్వామి మాట్లాడుతూ గుంటూరు బ్రహ్మయ్యకు సేవలు చేసినందుకు గాను 1940లో కోటప్పకొండరోడ్డులోని వారి స్థలంలో ఐదుసెంట్ల భూమిని రజక వర్గీయులైన దడిగె లక్ష్మయ్య, రాఘవులకు ఇవ్వటం జరిగిందన్నారు. ఆ భూమిలో ఐదేళ్లలో సత్ర నిర్మాణం చేసుకోవాలని కండిషన్ పెట్టడంతో కష్టపడి చందాలు వసూలుచేసి అన్నపూర్ణ సత్ర నిర్మాణం చేశారన్నారు. ఆ స్థలాన్ని రజకులకు రిజిష్టర్ చేయటం జరిగిందన్నారు. వారిలో రాఘవులు చనిపోవటంతో అతడి మృతదేహాన్ని సత్రం వెనుక పూడ్చిపెట్టి సమాధి నిర్మాణం చేశారన్నారు. అప్పటినుంచి కోటప్పకొండకు వచ్చే రజక భక్తులకు అన్నపానీయాలు అందజేయటం జరుగుతుందన్నారు. ఈ మధ్యకాలంలో సమాధిని కూలగొట్టి దానిపక్కనే ఉన్న వారి స్థలంలో కలుపుకొని మొత్తానికి ప్రహరీ ఏర్పాటు చేశారన్నారు. ఈ చర్యతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని, ఘటనకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకొని, రజకుల స్థలాన్ని కాపాడాలని వారు కోరారు. నడికోట సూర్యనారాయణ, దమ్మాటి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, దన్నవరపు ఆదిలక్ష్మి, జి.హనుమంతరావు, డి.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కంది, శనగ రైతులు పేర్లు నమోదు చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి మురళి



సాతులూరులో సాయిల్ హెల్త్‌కార్డులు అందిస్తున్న మురళి

నాదెండ్ల: రబీలో సాగైన కంది, శనగలను ప్రభుత్వం మద్దతు ధరకు రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నందున ముందుగా రైతులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. సాతులూరులో రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న మొక్కజొన్న, మిరప పంటలకు సాగునీరు లభ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంది మద్దతు ధర క్వింటా రూ.7550లు, శనగ రూ.5650లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. త్వరలో రైతు సేవా కేంద్రాల ద్వారా రెండు పంట ఉత్పత్తులను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి మాట్లాడారు. అనంతరం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందించారు. నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, ఏఓ హరిప్రసాద్, ఏఈఓలు బి.జీవన్‌నాయక్, వేణుగోపాల్, రామారావు, జీడీసీఎంఎస్ కొనుగోలు ఇన్‌చార్జి రామారావు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తియాప్ దోహదం



పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో స్వీయరక్షణ విధానాలను చూపుతున్న కరాటే నిపుణులు

నరసరావుపేట: మహిళలు భద్రతకు శక్తి యాప్ రక్షణ కవచంలా పనిచేస్తుందని అదనపు ఎస్పీ(పరిపాలన) జేవీ సంతోష్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలికల భద్రత కోసం తీసుకొచ్చిన శక్తి యాప్‌పై అవగాహన నిమిత్తం మంగళవారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ స్కూలు విద్యార్థినులతో స్వీయ రక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ సంతోష్ మాట్లాడుతూ ప్రతీ ఒక్క మహిళ తమ ఫోన్‌లో యాప్ నిక్షిప్తం చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం పొందాలని సూచించారు. అనంతరం యాప్‌ను ఉపయోగించే విధానం వివరించారు. అదేవిధంగా విద్యార్థి దశ నుంచి వారి మనోధైర్యాన్ని పెంపొందించుటకు కావాల్సిన స్వీయ రక్షణ మెలకువలను కరాటే ద్వారా ఎదుర్కొనే విధానాలను నిపుణులు ప్రదర్శించారు. మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకట రమణ, మహిళా పోలీస్ సిబ్బంది, శంకర భారతిపురం, తిలక్ స్కూలుకు చెందిన 500మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలకు పదును పెట్టాలి



మాట్లాడుతున్న ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు అంతర్గతంగా దాగిన నైపుణ్యాలకు పదును పెట్టాలని ఏఎన్‌యూ ఉప కులపతి ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంగళవారం ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా వీసీ గంగాధరరావు మాట్లాడుతూ జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకునే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి సూచించారు. కళాశాల కమిటీ అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాం సుందర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈసందర్భంగా ఎంకాం విద్యార్థిని షేక్ షహనాజ్, ఎంబీఏ విద్యార్థి కె.అనంతలక్ష్మి, ఎమ్మెస్సీ మ్యాథ్స్‌లో వై.నాగమణి, ఫిజిక్స్‌లో బి.దుర్గా లావణ్య, కంప్యూటర్స్ సైన్స్‌లో కె.నాగసాయి రమ్య, కెమిస్ట్రీలో జుబేర్ అహ్మద్, ఎంసీఏ విద్యార్థి ఎన్. సాయిలీల ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. బీకాం జనరల్ విభాగంలో టాపర్‌గా నిలిచిన నరేంద్ర, బీకాం కంప్యూటర్స్‌లో షేక్ ఫారినా, బీఎస్సీ బీజెడ్‌సీలో షేక్ ఇషా సుల్తానా, బీబీఏలో జి.శ్వేత, ఇంటర్మీడియెట్ ఎంపీసీలో టాపర్ పి. గౌస్య ప్రతిభా పురస్కారాలు పొందారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, అధ్యాపకులు బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, డీవీ చంద్రశేఖర్, ఎస్. శ్రీనివాసరావు, యు. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కో-కన్వీనర్‌గా తిరుమల



సత్తెనపల్లి: బీసీ సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా కో–కన్వీనర్‌గా సత్తెనపల్లికి చెందిన సంకుల తిరుమలరావు (తిరుమల), నియోజకవర్గ అధ్యక్షుడిగా మందడపు శివసాయిలు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లాకా వెంకటరావు యాదవ్ నుంచి తిరుమల, శివసాయిలు మంగళవారం నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తిరుమల, శివసాయి నియామకంపై పలువురు హర్షం వెలిబుచ్చారు.

గడ్డిమందు తాగి రైతు ఆత్మహత్య

పిడుగురాళ్ల: గడ్డిమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గుత్తికొండ గ్రామంలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి ఎస్ఐ మోహన్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గుత్తికొండ గ్రామానికి చెందిన పరిటాల పోతురాజు(60) అనే రైతు గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతోపాటు మతిస్థిమితం సక్రమంగా లేకపోవటం వలన సోమవారం రాత్రి గడ్డిమందు తన ఇంట్లోనే తాగాడు. గమనించిన భార్య హనుమాయమ్మ వెంటనే హుటాహుటిన పిడుగురాళ్ల ప్రైవేటు హాస్పటల్‌కు తరలించింది. ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం గుంటూరు జీజీహెచ్‌లో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుమారుడు పరిటాల రామలింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ పేర్కొన్నారు.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నరసరావుపేటటౌన్: మీటర్ రీడర్స్ అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సంఘ ప్రతినిధులు మంగళవారం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ రాంబొట్లను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి షేక్ యాసిన్, జాయింట్ సెక్రటరీ శివసాయి మాట్లాడుతూ మీటర్ రీడర్స్‌కి కనీస వేతనం అమలు చేయాలన్నారు. మీటర్ రీడర్స్‌కి ఎస్క్రో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. రిచార్జి స్మార్ట్ మీటర్లు వస్తున్న తరుణంలో మీటర్ రీడర్స్ అందరికీ సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలన్నారు. గత 20 ఏళ్లుగా చాలీచాలని జీతంతో పనిచేస్తున్నామని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. తమ సంఘం రాష్ట్రవ్యాప్త ప్రథమ మహాసభ అనంతరం కార్యచరణ ప్రకటించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా మీటర్ రీడర్స్ కార్మికులు మార్చి 18న డీఈ ఆఫీస్ ముందు ధర్నా, 20న ఎస్ఈ ఆఫీసు ముందు ధర్నా, 24న కలెక్టర్‌కు సమస్యలపై వినతి పత్రం సమర్పించడం, 27న సీఎండీ కార్యాలయం ముందు ధర్నా తదితర కార్యచరణ రూపొందించామన్నారు.

అప్పుల బాధ తాళలేక మహిళ ఆత్మహత్య

దామరపల్లి(తాడికొండ): వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పుల బాధ పెరిగి కుటుంబ పోషణ భారంగా మారడంతో మహిళ ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన తాడికొండ మండలం దామరపల్లి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తాడికొండ మండలం దామరపల్లి గ్రామానికి చెందిన వట్టికూటి శ్రీనివాసరావు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. గత కొన్నేళ్లుగా వ్యవసాయంలో నష్టం వస్తుండటంతో ఉన్న 3 ఎకరాలు అమ్మి అప్పులు తీర్చారు. కౌలుకు పొలం తీసుకొని వ్యవసాయం చేస్తుండగా ఈ ఏడాది కూడా తీవ్రంగా నష్టం రావడంతో మనస్తాపం చెందారు. అప్పు ఇచ్చిన వారు ఒత్తిడికి గురిచేస్తుండటంతో కుటుంబ పోషణ కూడా కష్టంగా మారడంతో మనస్తాపంతో శ్రీనివాసరావు భార్య అరుణ కుమారి ఈనెల 14న పొలానికి వేసేందుకు తెచ్చిన గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గుంటూరులోని ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా మంగళవారం ఉదయం మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

పట్టాభిపురం సీఐ పోస్టుపై సందిగ్ధం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పశ్చిమ సబ్ డివిజన్‌లోని పట్టాభిపురం పీఎస్ సీఐ పోస్టుపై సందిగ్ధం నెలకొంది. వీఆర్‌లో ఉన్న సీఐ ఎం.మధుసూదనరావును ఈనెల 16న పట్టాభిపురం పీఎస్ సీఐగా నియమిస్తూ ఓ పోలీస్ ఉన్నతాధికారి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అప్పటి వరకు విధుల్లో ఉన్న వీరేంద్రబాబును సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ క్రమంలో కొత్త సీఐగా మధుసూదనరావు అదే రోజు రాత్రి స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అయితే గుంటూరు రేంజ్ కార్యాలయం నుంచి ఈ పోస్టింగ్‌కు బ్రేక్‌పడినట్లు తెలుస్తోంది. దీంతో సందిగ్ధం నెలకొంది. బుధవారం సాధ్యమైనంత వరకు ఆయనే మళ్లీ సీఐగా కొనసాగే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

చిట్‌ఫండ్ బాధితుల విచారణ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): నరసరావుపేటలోని సాధన చిట్‌ఫండ్ బాధితులను సీఐడీ గుంటూరు ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం విచారణ చేశారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఎప్పటి నుంచి చిట్‌లు వేస్తున్నారు? ఎంత మొత్తంలో నెల నెలా చెల్లిస్తున్నారనే అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సుమారు 15 మందికి పైగా బాధితుల వద్ద వివరాలు సేకరించారు. అలాగే నరసరావుపేటలోని ఓ ప్రైవేటు బ్యాంక్ ప్రతినిధులు కూడా తమ గోడును సీఐడీ అధికారులకు వినిపించారు.